క్లుప్తంగా

భీమారం - మిర్యాలగూడ బస్సులు రద్దు

సూర్యాపేట : కేసారం సమీపంలో వరద ఉధృతంగా ప్రవహిస్తున్నందున సూర్యాపేట నుంచి మిర్యాలగూడ వయా భీమారం రూట్‌లో బస్సు సర్వీస్‌లు రద్దు చేసినట్లు సూర్యాపేట డిపో మేనేజర్ జి.లక్ష్మీనారాయణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రయాణికులు గమనించగలరని పేర్కొన్నారు. వరద తగ్గిన తర్వాత బస్సులు నడుస్తాయని తెలిపారు.

ఐడీ కార్డులు, బెల్టుల పంపిణీ



ఐడీ కార్డులు, బెల్టులు అందజేస్తున్న ఎంఈఓ

సూర్యాపేట రూరల్ : మండల పరిధిలోని కుప్పిరెడ్డిగూడెం ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు బుధవారం ఐడీ కార్డులు, బెల్టులను ఎంఈఓ శేషగాని శ్రీనివాస్‌గౌడ్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో పిల్లలమర్రి కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు కస్తూరి శ్రీదేవి, ప్రధానోపాధ్యాయురాలు గగ్గినపల్లి హైమావతి, ఉపాధ్యాయుడు ముప్పారపు నరేందర్, కదారి నిర్మల, కాకుమాను ఆరోగ్యమ్మ, ఎలపాటి జయశ్రీ, కళ్లెపల్లి విజయ్ పాల్గొన్నారు.

యువ ఆర్చరీ జట్టు కోచ్‌గా నూతనకల్ వాసి



ప్రసన్నకుమార్

నూతనకల్ : భారత యువ ఆర్చరీ జట్టు కోచ్‌గా మండల కేంద్రానికి చెందిన మర్రి పసన్నకుమార్ ఎంపికయ్యారు. ఆయన జార్ఖండ్ రాష్ట్రంలోని జంషెడ్‌పూర్‌లో ఉన్న టాటా ఆర్చరీ అకాడమీలో కోచ్‌గా పనిచేస్తున్నారు. ఈనెల 16నుంచి 26 వరకు కెనడాలోని విన్నిపెగ్ నగరంలో జరిగే ప్రపంచ యువత స్థాయి ఆర్చరీ ఛాంపియన్‌షిప్‌లో పాల్గొనే భారత జట్టుకు కోచ్‌గా ఎంపికయ్యారు. అంతర్జాతీయ స్థాయిలో ప్రతిష్టలు రావడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నిరుద్యోగ యువతకు శిక్షణ

సూర్యాపేట : మైత్రి సాధన ఫౌండేషన్, 45వ వార్డు మాజీ కౌన్సిలర్ గండూరి పావని కృపాకర్ ఆధ్వర్యంలో ఈ నెల 15నుంచి విద్యానగర్‌లో నిరుద్యోగ యువతకు 90 రోజుల పాటు ఉచిత బ్యూటీషియన్, కంప్యూటర్ కోర్సులు నిర్వహించనున్నట్లు మాజీ కౌన్సిలర్ గండూరి పావని కృపాకర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణతోపాటు ఉచిత భోజనం, వసతి సదుపాయం అందిస్తున్నామని తెలిపారు.

ఏచూరికి నివాళి



నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

నాగారం : సీపీఎం అఖిల భారత మాజీ ప్రధాన కార్యదర్శి ఏచూరి సీతారాం ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సీపీఎం మండల కన్వీనర్ దేవరకొండ యాదగిరి అన్నారు. బుధవారం సీతారాం ఏచూరి జయంతి సందర్భంగా డి.కొత్తపల్లి గ్రామంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. దేశం గర్వించదగ్గ నేత సీతారాం ఏచూరి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు వీరయ్య, నాగలక్ష్మి, వెంకటమ్మ, మల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

నూతనకల్ : సీపీఎం జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి ఆశయ సాధనకు కృషి చేయాలని సీపీఎం మండల కార్యదర్శి కందాల శంకర్‌రెడ్డి కోరారు. సీతారాం ఏచూరి జయంతిని పురస్కరించుకొని బుధవారం చిల్పకుంట్లలో ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం మండల కమిటీ సభ్యులు సామ వెంకట్‌రెడ్డి, బత్తుల తిరమలేష్, అందెపల్లి లక్ష్మయ్య, సామ సురేందర్‌రెడ్డి, ఎర్ర ఉప్పల్‌రెడ్డి, కూసు సైదులు, గజ్జెల శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జోరువాన .. వరద ఉధృతం



ఆత్మకూర్(ఎస్) : అలుగుపోస్తున్న తుమ్మల పెన్‌పహాడ్ పెద్దచెరువు



సూర్యాపేట : ప్రియాంక కాలనీలో నిలిచిన వర్షపు నీరు



సూర్యాపేట : స్నేహ నగర్ కాలనీలో..



జాజిరెడ్డిగూడెంలో అలుగుపోస్తున్న చెరువు



అర్వపల్లి : పర్సాయపల్లిలో కాలువకు పడిన గండి

సూర్యాపేట : పట్టణంలో రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి పలు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ప్రియాంక కాలనీ, తిరుమల నగర్, బాలాజీ నగర్ పట్టణ శివారు ప్రాంతాలు, హనుమాన్ నగర్, 60 ఫీట్ల రోడ్డు, సుందరయ్య నగర్ కాలనీలలో వర్షం నీరు నిలిచి కాలనీవాసులు ఇబ్బంది పడుతున్నారు. సూర్యాపేట మున్సిపాలిటీ కమిషనర్ పలు ప్రాంతాల్లో సందర్శించి సిబ్బందికి సూచనలు చేశారు. లోతట్టు ప్రాంతాల్లో ఇళ్లలోకి నీరు వచ్చే కాలనీలను గుర్తించి వారిని అక్కడ నుంచి సురక్షిత ప్రాంతాలకు తరలించాలని తెలిపారు. అత్యవసరమైతే తప్ప ఎవరూ బయటికి రావద్దని, పాడుబడిన ఇళ్లలో ఉండవద్దని సూచించారు. రోడ్ల పక్కన ఉన్న విద్యుత్ స్తంభాలను తాకవద్దని తెలిపారు.

ఆత్మకూర్(ఎస్) : ఆత్మకూర్(ఎస్) మండల వ్యాప్తంగా బుధవారం సాయంత్రం జోరు వాన కురిసింది. ఇప్పటికే మండల వ్యాప్తంగా దాదాపు అన్ని చెరువులు అలుగుపోస్తున్నాయి. ఏపూరు వద్ద బిక్కేరు వాగు బ్రిడ్జి పైనుంచి ఉధృతంగా ప్రవహిస్తుండడంతో అధికారులు రాకపోకలను నిలిపివేశారు. తుమ్మల పెన్‌పహాడ్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గదులు కురుస్తుండడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పాఠశాలకు తాళం వేశారు. భారీ వర్షాల నేపథ్యంలో పాత ఇళ్లలో ఉండవద్దని, అత్యవసరమైతే తప్ప ప్రయాణాలు చేయవద్దని తహసీల్దార్ అమీన్ సింగ్, ఎస్ఐ శ్రీకాంత్ గౌడ్‌లు ప్రకటనలో కోరారు.

అర్వపల్లి : భారీ వర్షాలకు మండలంలోని కాసర్లపహాడ్ మినహా అన్ని గ్రామాలలో చెరువులు, కుంటలు నిండి అలుగుపోస్తున్నాయి. భారీ వర్షాలతో ఒక్క రోజులోనే అన్ని చెరువులు, కుంటలు నిండాయి. దీంతో ఈ సీజన్‌లో పంటలకు ఎలాంటి ఢోకా లేదని అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఎస్సారెస్పీ 71డీబీఎం కాలువకు గండి

అర్వపల్లి : భారీ వర్షానికి జాజిరెడ్డిగూడెం మండలం పర్సాయపల్లి శివారులో ఎస్సారెస్పీ 71డీబీఎం కాలువకు గండి పడింది. ఈ గండి పెద్ద గోతిలా ఏర్పడింది. గండిని బుధవారం నీటిపారుదలశాఖ ఏఈ హరిస్వరూప్ పరిశీలించి విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. వర్షం తగ్గగానే తాత్కాలికంగా గండిని పూడ్చివేయించి మరమ్మతులు చేపట్టనున్నట్లు చెప్పారు. గండిలో పశువులు, ద్విచక్ర వాహనాలు పడకుండా చుట్టూ కంప మండలు వేయించారు. ఎస్సారెస్పీ కాలువలకు లైనింగ్ చేయించాలని రైతులు కోరుతున్నారు.

అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయం

● ఎమ్మెల్యే మందుల సామేల్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సామేల్

తిరుమలగిరి : దేశంలో ఎక్కడా లేని విధంగా అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తోందని, రాష్ట్రంలో ఏ ఎన్నిక జరిగినా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థే విజయం సాధిస్తారని ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. బుధవారం తిరుమలగిరిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు నియోజకవర్గంలో 90 శాతం చెరువులు, కుంటలు నిండాయని, దీంతో రైతులు ఎంతో సంతోషంగా ఉన్నారని తెలిపారు. రైతులకు విత్తనాలు, ఎరువులకు ఎలాంటి ఇబ్బంది లేదని, యూరియా అందుబాటులో ఉందని అన్నారు. బీఆర్ఎస్ నాయకులు ప్రకృతిని అడ్డం పెట్టుకొని దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ వస్తే కరువొస్తుందని అన్నారని, ఇకనైనా వారికి కనువిప్పు కలగాలని కోరారు. ఎస్సారెస్పీ కాల్వల ద్వారా కూడా త్వరలోనే గోదావరి జలాలు వస్తాయని తెలిపారు. 42 శాతం బీసీ రిజర్వేషన్లు ఇవ్వడానికి రాష్ట్ర ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉందని అన్నారు. ఏ సమయంలోనైనా స్థానిక సంస్థల ఎన్నికలకు నోటిఫికేషన్ రావొచ్చని, పార్టీ నాయకులంతా సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. మరో రెండు, మూడు రోజులు భారీ వర్షాలు ఉన్నాయని, ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు వై.నరేష్, పీఏసీఎస్ చైర్మన్ పాలెపు చంద్రశేఖర్, పట్టణ అధ్యక్షుడు పేరాల వీరేష్, జమ్మిలాల్, నర్సింహారెడ్డి, అంబేద్కర్, లక్ష్మయ్య, రాముగౌడ్, శ్రీధర్, డానియల్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసి నాయకులు

నాగారం : మండల పరిధిలోని నాగారంబంగ్లా గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బుధవారం స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు తిరుమలగిరిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే సామేల్‌ను కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గ్రామంలో వీధిలైట్లు, డ్రెయినేజీలు, అంతర్గత రోడ్లు వేయించాలని కోరారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కొణిరెడ్డి మోహన్‌రెడ్డి, బయ్యం వెంకన్న, అనంతోజు కరుణాచారి, పులగం సంజీవరెడ్డి, చీమల లింగయ్య, కొణిరెడ్డి రవీందర్‌రెడ్డి, ననుబోతుల ఉప్పలయ్య, వీరయ్య తదితరులు ఉన్నారు.

వరద బాధిత కుటుంబాలకు సాయం



తిరుమలగిరి: బియ్యం అందజేస్తున్న అధికారులు



నిత్యావసర సరుకుల పంపిణీ..

తిరుమలగిరి : తొండ గ్రామంలోని వరద ప్రభావిత ప్రాంతాల్లో 39 కుటుంబాలకు తొర్రూరు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తొర్రూరు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు రామనర్సయ్య, కోశాధికారి శ్రీనివాస్, తహసీల్దార్ హరిప్రసాద్, డిప్యూటీ తహసీల్దార్ జాన్ మహ్మద్, ఆర్ఐ జార్జిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి యాకూబ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు బియ్యం అందజేత

తిరుమలగిరి : తొండ గ్రామంలో వరద ప్రభావిత ప్రాంతాల కుటుంబాలకు తహసీల్దార్ బి.హరిప్రసాద్ బుధవారం 20 కిలోల చొప్పున సన్న బియ్యం పంపిణీ చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు బియ్యం పంపిణీ చేశామని తహసీల్దార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ జాన్ మహ్మద్, గిర్దవార్, జార్జిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.

డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం



తిరుమలగిరి : డ్రగ్స్ నిర్మూలనపై మున్సిపల్ కార్యాలయంలో ప్రతిజ్ఞ చేస్తున్న సిబ్బంది



తిరుమలగిరి : ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు, అధ్యాపకులు

తిరుమలగిరి : డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దామని తిరుమలగిరి మున్సిపల్ కమిషనర్ మున్వర్ అలీ అన్నారు. బుధవారం మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ సిబ్బందిచే ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రగ్స్ అమ్మకం, కొనుగోలు, అక్రమ రవాణా చేసే వ్యక్తుల సమాచారం అధికారులకు తెలియజేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు అధికారులు, బిల్ కలెక్టర్లు, ఆర్పీలు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో..

మాదక ద్రవ్యాల నిర్మూలనపై తిరుమలగిరి మున్సిపల్ కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులతో బుధవారం ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మృత్యుంజయ మాట్లాడారు. మాదక ద్రవ్యాలపై జరుగుతున్న పోరాటంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల నివారణకు కృషి చేయాలి

మద్దిరాల : మాదక ద్రవ్యాల నివారణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని సీఐ నరసింహారావు, ఎస్ఐ వీరన్న అన్నారు. బుధవారం నషా ముక్త అభియాన్ కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలో మాదక ద్రవ్యాల నివారణపై ప్రతిజ్ఞ చేయించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ప్రభాకర్, కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పచ్చిపాల వెంకన్న, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు

తుంగతుర్తి : డ్రగ్స్ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కళాశాల ప్రిన్సిపాల్ రాజామోహన్ రావు అన్నారు. మాదకద్రవ్యాల నిర్మూలనపై బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కలెక్టర్ ఆదేశాల ప్రకారం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించి మాట్లాడారు. విద్యార్థులు డ్రగ్స్ బారిన పడకుండా మంచి జీవనశైలిని అలవర్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల స్టూడెంట్ కౌన్సిలర్ పజ్జూరి పుల్లయ్య, ఎన్ఎస్ఎస్ పీఓలు నాగయ్య, ప్రవీణ్, అధ్యాపక బృందం, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నాగారం : యువత, విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని ఎస్ఐ ఐలయ్య అన్నారు. నషా ముక్త భారత్ అభియాన్‌లో భాగంగా బుధవారం మండల పరిధిలోని పసునూర్ మోడల్‌స్కూల్‌లో విద్యార్థులకు డ్రగ్స్ నివారణపై అవగాహన కల్పించి, ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాలకు అలవాటు పడితే జీవితం అంధకారం అవుతుందని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బల్గూరి చంద్రబాబు, పోలీస్ సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



తుంగతుర్తిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రతిజ్ఞ చేస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు



మద్దిరాలలో మాదకద్రవ్యాల నివారణపై ప్రతిజ్ఞ చేయిస్తున్న సీఐ నరసింహారావు

వర్షాల దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



అర్వపల్లిలో హైవే వెంట నిలిచిన నీటిని పరిశీలిస్తున్న మండల అధికారులు



చివ్వెంల : ఐలాపురం గ్రామానికి వెళ్లే రహదారిపై వరదను పరిశీలిస్తున్న అధికారులు



పెన్‌పహాడ్ : పొట్లపహాడ్ శివారులో వంతెనపై ప్రవహిస్తున్న వరదను పరిశీలిస్తున్న తహసీల్దార్



తుంగతుర్తి : సంగెంలో దెబ్బతిన్న రోడ్డును పరిశీలిస్తున్న ఆర్డీఓ వేణుమాధవ్

తుంగతుర్తి : భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూర్యాపేట ఆర్డీఓ వేణుమాధవ్ అన్నారు. మండల పరిధిలోని సంగెం గ్రామంలో భారీ వర్షాలకు తెగిన రోడ్డును బుధవారం పరిశీలించి మాట్లాడారు. భారీ వర్షాలతో వెలుగుపల్లిలోని రుద్రమ చెరువు అలుగు ఉధృతికి సంగెం వద్ద రోడ్డు తెగడంతో సంగెం నుంచి కోడూరు, తిమ్మాపురం రహదారిలో రాకపోకలు నిలిచిపోయాయని అన్నారు. భారీ వర్షాల కారణంగా లోతట్టు ప్రాంతాలలో ఉన్న గ్రామాల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. శిథిలావస్థలో ఉన్న ఇళ్లలో ఉండొద్దని, సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలని అన్నారు. సుదూర ప్రాంతాలకు వెళ్లే ప్రజలు తమ ప్రయాణాలను వాయిదా వేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ దయానందం, పంచాయతీరాజ్ డీఈ లింగనాయక్, ఏఈ మహేష్, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

అర్వపల్లి : భారీ వర్షాల నేపథ్యంలో బుధవారం మండల స్థాయి అధికారులు అర్వపల్లితోపాటు వివిధ గ్రామాలను సందర్శించారు. అర్వపల్లిలో హైవేపై వరద పారుతుండటంతో పరిశీలించి రోడ్డుపైకి నీళ్లు రాకుండా చూస్తామన్నారు. అలాగే అన్ని గ్రామాలలో చెరువులు, కుంటలు, రహదారులను పరిశీలించారు. పర్సాయపల్లిలో వరదకు దెబ్బతిన్న ఎస్సారెస్పీ కాలువను పరిశీలించి తాత్కాలికంగా మరమ్మతు చేయిస్తామని చెప్పారు. భారీ వర్షాల దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ బాషపాక శ్రీకాంత్, ఎంపీడీఓ పి.గోపి, నీటి పారుదలశాఖ ఏఈలు హరిస్వరూప్, హారిక, ఎస్ఐ ఈట సైదులు, పంచాయతీ కార్యదర్శి శ్రవంతి, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాలను సందర్శించిన అధికారులు

చివ్వెంల : వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అధికారులు అప్రమత్తమయ్యారు. మండల కేంద్రంతోపాటు మండల పరిధిలోని వివిధ గ్రామాలను సందర్శించి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. అత్యవసరమైతే తప్పా బయటకు రావొద్దని ప్రజలకు సూచిస్తున్నారు. చెరువులు, కుంటలను పరిశీలిస్తున్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ప్రకాశ్‌రావు, ఎంపీడీఓ సీహెచ్. సంతోష్ కుమార్, ఎస్ఐ వి.మహేశ్వర్, ఇరిగేషన్ డీఈ శ్రీనివాస్, పంచాయతీ రాజ్ ఏఈ రాహుల్ పాల్గొన్నారు.

పెన్‌పహాడ్ : ప్రస్తుతం కురుస్తున్న వర్షాల పట్ల మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ లాలు కోరారు. బుధవారం అనంతారం-పొట్లపహాడ్ గ్రామాల మధ్య లోలెవల్ వంతెనపై నుంచి ప్రవహిస్తున్న వరద ఉధృతిని ఆయన పరిశీలించారు. రహదారిపై వాహనదారులు జాగ్రత్తగా చూసుకొని వెళ్లాలని సూచించారు. వరద ఉధృతికి పంట పొలాలు నీట మునిగాయి. ఈ కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుల్స్ యాదగిరి, మురళీధర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు.

మద్దిరాల : భారీ వర్షాల దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ వీరన్న అన్నారు. బుధవారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో వాగులు, కాలువలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయని, అలాంటి సమయంలో ఎవరు కూడా వాగులు దాటే ప్రయత్నం చేయకూడదని తెలిపారు. శిథిలావస్థలో ఉన్న మిద్దెలు, ఇళ్లలో ఉండవద్దని సూచించారు. ఏవైనా ఇబ్బందులు కలిగితే వెంటనే 100కు డయల్ చేసి పోలీసులకు సమాచారం అందించాలని అన్నారు.

అవయవ దానంపై అవగాహన

సూర్యాపేట : ప్రపంచ అవయవ దాన దినోత్సవం సందర్భంగా జిల్లా స్పందన సేవా సంస్థ ఆధ్వర్యంలో జమ్మిగడ్డ వాకర్స్ క్లబ్ సభ్యులు బుధవారం అవయవదానంపై అవగాహన సదస్సు నిర్వహించారు. అన్ని దానాల కన్నా అవయవదానం గొప్పదన్నారు. అవయవాలు కావలసినవారు కేంద్ర ప్రభుత్వ జీవన్దాన్‌లో తమ పేర్లు నమోదు చేసుకోవాలని నిర్వాహకులను కోరారు. ఇందుకు జీవన్దాన్ ఫోన్ నంబర్ 040 2348 9494ను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో స్పందన సేవా సంస్థ గౌరవ అధ్యక్షుడు, విశ్రాంత ఉపాధ్యాయుడు గుండా రమేష్, సంస్థ అధ్యక్షుడు జి.రమేష్, ప్రధాన కార్యదర్శి మిట్టకోల కోటయ్య, కోశాధికారి పిచ్చిరెడ్డి, అంకత వెంకన్న, వెంకటేశ్వర్లు, శోభన్, గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

మోదీ, ట్రంప్‌ల దిష్టిబొమ్మలు దహనం



సూర్యాపేట : ప్రధాని మోదీ, అమెరికా అధ్యక్షుడు ట్రంప్ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు



నూతనకల్‌లో..

సూర్యాపేట : కార్పొరేట్ శక్తులు భారత వ్యవసాయ రంగాన్ని విడిచి పెట్టాలని ఎస్‌కేఎం జిల్లా కన్వీనర్ మండారి డేవిడ్ కుమార్, ఏఐకేఎఫ్ రాష్ట్ర నాయకుడు వరికుప్పల వెంకన్న, సీపీఐ పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ములకలపల్లి రాములు అన్నారు. ఎస్కేఎం జాతీయ కమిటీ పిలుపులో భాగంగా బుధవారం కొత్త బస్టాండ్ వద్ద అమెరికా అధ్యక్షుడు ట్రంప్, భారత ప్రధాని నరేంద్ర మోదీ దిష్టిబొమ్మలను దహనం చేశారు. తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మట్టిపల్లి సైదులు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బెల్లంకొండ సత్యనారాయణ, ఏఐటీయూసీ సీనియర్ నాయకుడు దంతాల రాంబాబు, ఇఫ్టూ జిల్లా సహాయ కార్యదర్శి కునుకుంట్ల సైదులు, బహుజన మహాసభ రాష్ట్ర నాయకుడు నారబోయిన వెంకట్‌యాదవ్, నాయకులు వల్లపుదాసు సాయికుమార్, పోతెబోయిన కిరణ్, నరసింహారావు, ఎల్గూరి గోవింద్, పిండిగా నాగమణి, తదితరులు పాల్గొన్నారు.

నూతనకల్ : అమెరికాతో భారత్ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలను రద్దు చేసుకోవాలని కోరుతూ ఏఐకేఎంఎస్, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని సూర్యాపేట-దంతాలపల్లి ప్రధాన రహదారిపై బుధవారం మోదీ, ట్రంప్‌ల దిష్టిబొమ్మలను దహనం చేశారు. ఈ సందర్భంగా ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి గంటా నాగయ్య మాట్లాడారు. విదేశీ బహుళజాతి కంపెనీలను దేశం నుంచి నిషేధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా సహాయ కార్యదర్శి దేసోజు మధు, దాసరి శ్రీనివాస్, పచ్చిపాల లింగయ్య, దగ్గుల మల్లయ్య, గడ్డం శ్రీను, కూసు ఉప్పలయ్య, ఇరుగు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

న్యాయం చేయాలని ధర్నా

నూతనకల్ : తనకు న్యాయం చేయాలని కోరుతూ మండల పరిధిలోని లింగంపల్లి గ్రామంలో పసిబిడ్డతో ఓ మహిళ ప్రియుడి ఇంటి ఎదుట ధర్నాకు దిగింది. స్థానికులు, బాధిత మహిళ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బొప్పాని సుజాతకు ఇద్దరు కుమారులు. ఆమె భర్త, కుమారుడు రోడ్డు ప్రమాదాల్లో చనిపోయారు. దీంతో ఆమె ఒక కుమారుడితో గ్రామంలోనే జీవనం కొనసాగిస్తోంది. అదే గ్రామానికి చెందిన కారింగుల సైదులు భార్య మృతి చెందడంతో సుజాత, సైదులు గత 20 నెలలుగా వివాహేతర సంబంధం కొనసాగించారు. దీంతో సుజాత గర్భం దాల్చి మగబిడ్డకు జన్మనిచ్చింది. తన జీవితానికి భరోసా కల్పించాలని కోరుతూ బాధిత మహిళ తన కుటుంబ సభ్యులతో కలిసి బుధవారం సైదులు ఇంటి ఎదుట ధర్నాకు దిగింది. విషయం తెలుసుకున్న ఎస్ఐ నాగరాజు గ్రామానికి చేరుకొని బాధిత మహిళ నుంచి వివరాలు సేకరించారు. స్టేషన్‌కు వచ్చి దరఖాస్తు ఇచ్చినట్లయితే చట్టరీత్యా చర్యలు తీసుకొని న్యాయం చేస్తామని ఎస్ఐ హామీ ఇవ్వడంతో వారు ధర్నాను విరమించారు.

సమస్యలు పరిష్కరించాలి

నాగారం : మోడల్ స్కూల్‌లలో పనిచేస్తున్న అవర్లీ బేస్డ్ టీచర్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బుధవారం హెచ్‌బీటీఏ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రెడ్డబోయిన నాగరాజు హైదరాబాద్‌లో ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్‌రెడ్డి, డైరెక్టర్ స్కూల్ ఎడ్యుకేషన్ కమిషనర్ నవీన్ నికోలస్‌లను కలిసి వినతిపత్రం అందజేశారు. అలాగే ఈ విషయంపై సీఎంఓ అజిత్‌రెడ్డి, పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు గుండు లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి దామోదర్‌రెడ్డి, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు సోమిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డిలను కలిసి వినతిపత్రాలు అందించినట్లు తెలిపారు. ఆయనతోపాటు సంఘం నాయకులు ఉన్నారు.

వీధిలో నాట్లు వేసి నిరసన

పెన్‌పహాడ్ : మాచారం గ్రామంలోని ఎస్సీ కాలనీలో ఓ వీధి వర్షపు నీరు నిలిచి చెరువును తలపిస్తోంది. దీంతో బుధవారం గ్రామస్తులు ఆ వీధిలోని నీటిలో వరినాట్లు వేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. వీధిలో డ్రెయినేజీ నిర్మాణం చేపట్టి సమస్య పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బొక్క ఎలిషరాజ్, పల్లెపంగి గోపయ్య, ఇటికాల సురేందర్, పుల్లమ్మ పాల్గొన్నారు.

మహాసభలను జయప్రదం చేయాలి

సూర్యాపేట : సెప్టెంబర్ 1న తుంగతుర్తిలో జరిగే భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా మూడవ మహాసభలను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాంబాబు పిలుపునిచ్చారు. బుధవారం సీఐటీయూ కార్యాలయంలో మహాసభల ఆహ్వాన పత్రికను విడుదల చేసి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను ఖండిస్తూ కార్మిక వర్గం ఐక్యంగా పోరాడాలని అన్నారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అనంతుల మల్లయ్య, ఎల్క సోమయ్య గౌడ్ జిల్లా ఉపాధ్యక్షుడు లాకావత్ బాలాజీ నాయక్, ఒగ్గు సైదులు, వెంకన్న, మల్లయ్య, రాములు, రేణుక పాల్గొన్నారు.

ఘనంగా బోనాల పండుగ

మద్దిరాల : మండల పరిధిలోని కుంటపల్లి, రెడ్డిగూడెం గ్రామాలలో బుధవారం బోనాల పండుగను ప్రజలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బోనాలతో ఊరేగింపుగా వెళ్లి ముత్యాలమ్మకు నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

సంక్షిప్త సమాచారం

ప్రభుత్వ పథకాలు పొందాలి

అర్వపల్లి : మహిళలు సంఘాలలో చేరి ప్రభుత్వ పథకాలు పొందాలని ఐకేపీ ఏపీఎం కొమ్ము రాంబాబు కోరారు. స్థానిక ఐకేపీ కార్యాలయంలో బుధవారం జరిగిన మండల మహిళా సమాఖ్య సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఇందిరా మహిళా శక్తిలో భాగంగా ప్రతి కుటుంబం నుంచి ప్రతి మహిళను మహిళా సంఘాలలో చేర్పించాలన్నారు. అలాగే వికలాంగులు, వృద్ధులు, కిశోరబాలికలతో సంఘాలు ఏర్పాటు చేసి ప్రభుత్వ పథకాలు అందరికీ అందేలా చూడాలన్నారు. ఈ సమావేశంలో మహిళా సమాఖ్య మండల అధ్యక్ష, కార్యదర్శులు బొడ్డు స్వప్న, మేకల సునీత, వీఓఏలు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి సహకరించాలి

అర్వపల్లి : ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి దాతలు సహకరించాలని ఎంఈఓ బి.బాలునాయక్ కోరారు. జాజిరెడ్డిగూడెం గ్రామపంచాయతీ కార్మికుడు బోయపల్లి వీరయ్య కూతురు అదే గ్రామంలోని జెడ్పీహెచ్ఎస్‌లో 10వ తరగతి చదువుతుంది. అయితే ఆమెకు నేషనల్ మీన్స్‌కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ కింద రూ.12వేలు రాగా వాటిని పాఠశాలకు విరాళంగా అందజేశారు. విరాళంతో పిల్లలకు టీషర్ట్‌లు, ఫ్యాన్‌లు, ఇతర సామగ్రిని బహూకరించారు. విద్యార్థులకు టీషర్ట్‌లను ఎంఈఓ బాలునాయక్ బుధవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్మికులు బోయపల్లి వీరయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సహకారం అభినందనీయం

పెన్‌పహాడ్ : పూర్వవిద్యార్థులు అందిస్తున్న సహకారం అభినందనీయమని ఎంఈఓ నకిరేకంటి రవి, కాంప్లెక్స్ హెచ్‌ఎం మల్లారెడ్డి అన్నారు. పూర్వవిద్యార్థులు బుధవారం మహ్మదాపురం ప్రాథమిక పాఠశాలకు మైక్‌సెట్, క్రీడా వస్తువులను అందజేశారు. అదే విధంగా విద్యార్థులకు ఆశాజ్యోతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో శ్రీరామ్ వెంకట్ బ్యాగులు, నోట్‌బుక్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు వెంకట్, వెంకన్న, నాగేందర్, రాంబాబు, వెంకటయ్య అంజి, సత్యం, మధు, రామారావు, వేణు, సైదులు తదితరులు పాల్గొన్నారు.

క్రీడాదుస్తులు అందజేత

ఆత్మకూర్ (ఎస్) : వంగేటి చెన్నారెడ్డి జ్ఞాపకార్థం వారి మనవడు కొండేటి కేశవరావు కందగట్లలోని జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులకు క్రీడా దుస్తులు అందించడం అభినందనీయమని అక్షర ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి రుద్రంగి కాళిదాసు అన్నారు. అక్షర ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం పాఠశాల విద్యార్థులకు క్రీడా దుస్తులను అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం మురళీకృష్ణ, కొండేటి కేశవరెడ్డి, కందాల వెంకటరెడ్డి, రామచంద్రారెడ్డి, భూతం లింగయ్య, శిగ శ్రీనివాస్, బొల్లం కృష్ణయ్య, వనమాల శ్రీనివాస్, కిషన్‌సింగ్, మల్లారెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.